

# శ్రీరాగం

తురగా జానకీరాణి






శ్రీరేఖకు అక్కడకు వెళ్ళడం ఇష్టం లేదు. ఏదో ఒక విదేశీ భాష నేర్చుకోవాలని కోర్సులో చేరింది కానీ, దేవాలయాలు, మఠాలు, స్వాములాటవి అంటే బొత్తిగా గిట్టదు. సహాధ్యాయిని విజయ బలవంతం మీద దేవాలయంలోకి ఆ సాయంత్రం వెళ్ళింది.

ఆరున్నర ప్రాంతంలో ఆమె వెళ్ళినప్పుడు అంతా నిశ్శబ్దం. కనులపండువుగా విగ్రహం, చుట్టూ అలంకరించిన పూలు, సన్నని వెలుతురు, పెద్ద హాలు నిండా తివాచీలు. విగ్రహం మీద వెన్నెల లాంటి వెలుగు. ఏడు గంటలైనాక, తెల్ల బట్టలు కట్టుకున్న ఒక యువకుడు వచ్చి పూజ ప్రారంభించాడు. పూజకు కూర్చున్న అతని సుందర విగ్రహాన్ని విస్మయంతో చూచింది రేఖ. పాల రాతితో తయారైన శిల్పమే అతను!

శరీరంలో కలిసిపోతున్న స్వచ్ఛమైన తెల్లని పంచె, ఉత్తరీయం, సగం మూసిన కళ్ళపైన మెరిసే కళ్ళద్దాలు. హారతి పట్టిన అతని చేయి తేగంటతో పాటు లయగా, లతలా ఊగుతోంది. శ్రీరేఖ ఆరాధనతో చూసింది. అతనెందుకు యిక్కడకు వచ్చి చేరాడో!

హారతి, భజనలు, సంకీర్తనాలు అన్నీ పూర్తయినాయి. ఒక క్రమశిక్షణకు లోబడి కదలకుండా కూర్చున్నదే కానీ రేఖకు యిదంతా ఒక సినిమాలా అనిపించింది. విగ్రహాలకు ప్రాణం వుంటుందా, మనశ్శాంతినిస్తాయా? ఇటువంటి ఆలోచనలు రేఖలో పొడుకొనే వుంటాయెప్పుడూ,

ఆ తర్వాత ఒకనాడు లైబ్రరీలో కనబడ్డాడు అతను. విజయ పరిచయం చేసింది. మంచి ముత్యాల హారాలు గుర్తుకు వస్తాయి అతడి ఆకారం చూస్తే. నవ్వితే ఎర్రని పంటి చిగుళ్ళు కన్పిస్తాయి తప్పనే అనుమానం కూడా రాకుండా పరిశీలనగా చూడసాగింది రేఖ. "మీకు జీవితం మీద ఎందుకింత విరక్తి కలిగింది? జీవితాంతం బ్రహ్మచర్యానికి, మఠంలో సేవకూ అంకితమై పోతానని ఎందుకు దీక్ష తీసుకున్నారు?" అంటూ ప్రశ్నలు వేయాలని ఆమె ఆలోచన, కానీ అలా అడిగేంత పరిచయమేది

కొన్నాళ్ళు గడిచాయి. అతన్ని చూడాలనే వెడుతోంది [illegible] ఆ సమయానికి, అక్కడికి. తను యీ విధంగా చేయడం [illegible] అని పించక పోలేదు. కానీ ఒక కుతూహలం, ఆకర్షణ తెలిసికో[illegible]నే పట్టుదలతో ఆమె దేవాలయానికి వెడుతోనే ఉంది.

దీపావళి శుభాకాంక్షలతో
మీ జూలూరి నగరాజారావు

వివాహాది శుభకార్యములకై విచ్చేయండి
పట్టుచీరలకు పెట్టింది పేరు

జూలూరి వీరేశలింగం
బనారస్ సిల్క్ పాలెస్

జూలూరి మాన్షన్-జనరల్ బజార్
సికింద్రాబాద్-
ఫోన్: 72333
76545

ఆనాడు అందరూ వెళ్ళిపోయాక, ఆమె యింకా నిలబడి తీర్థం తీసుకొని, ధైర్యం తెచ్చుకొంటూ అన్నది- "మీతో మాట్లాడాలి" అని. అతను ఆశ్చర్యంగా చూసి, పంచపాత్రను బల్ల మీద పెట్టి చేతులు తుడుచుకుంటూ వచ్చి, "ఏమిటి చెప్పండి!" అన్నాడు. వాల్చిన కళ్ళు, తల మీద పలుచగా వున్న వెంట్రుకల మధ్య చిన్న పిలక.

"మీకెవ్వరూ లేరా? ఎందుకిక్కడికి వచ్చారు?" అన్నది రేఖ. అతను కొంచెం కలవరపడ్డట్లు చూసి, "మీరు అట్లాంటివి అడుగకూడదు" అన్నాడు. "ఎందుకని? నిజం చెప్పడానికి మీరు భయపడకూడదుగా?" అన్నది రేఖ రెట్టిస్తున్నట్లు.

అతను కళ్ళెత్తి చూశాడు "భయం కాదు. అనవసరమని నా అభిప్రాయం"

"మీకు అనవసరమనిపించవచ్చుగానీ నాకు అవసరమే" అన్నది రేఖ.

దేవాలయంలోకి ఎవరో స్వామీజీ ప్రవేశించారు అప్పుడే. బ్రహ్మచారి వెనక్కి తిరిగాడు. రేఖ తీవిగా బయటకు నడిచింది.

ఇంకొక అవకాశం కోసం ఎదురుచూస్తోంది రేఖ. ఆవరణలో, తోటలో, పుస్తకాలయంలో అతను కనిపించినప్పుడల్లా నమస్కారం పెడుతోంది. అతను, చిరునవ్వుతో ప్రతి నమస్కారం చేస్తున్నాడు. చివరికి ఒకనాడు అతను ఒంటరిగా మెట్ల మీద కూర్చొని ఉండగా ఆమెకి అవకాశం దొరికినట్లయింది ఆ రోజు అనుకోకుండా పెందరాళే రావడం మంచిదే అయిందనుకొంది రేఖ.

"అమ్మయ్య! దొరికారు. ఇప్పుడు చెప్పండి. మీకు ఇంత విరక్తి ఎలా కలిగింది? ప్రపంచంలో మీ వయస్సువాళ్ళంతా చదువుకొంటున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. వేలకి వేలు కట్నాలు పుచ్చుకొని పెళ్ళిళ్ళు చేసుకొంటున్నారు. మీకు ఏం తక్కువని, వచ్చి యిక్కడ ముక్కు మూసుకొని కూర్చున్నారు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

అతను నవ్వాడు, ఎంతో హాయిగా. అన్ని ప్రశ్నలూ వదిలేసినట్లు. "నేను ముక్కు మూసుకొని ఎందుక్కూచున్నా? కళ్ళు తెరచుకొని అన్నీ చూస్తున్నాను. జ్ఞానం సంపాదించుకొంటున్నాను" అన్నాడు.

"నాలుగు గోడల మధ్య పంజరంలోని చిలుకలా కూర్చుని మడిగా అంటీ ముట్టనట్లు తిరుగుతోంటే మీరు అందుకొనే జ్ఞానం ఏమిటి స్వామీ!" అన్నది రేఖ చిలిపిగా. వయ్యారంగా నిలబడి చిరునవ్వుతో ఆమె విసిరిన ఈ ప్రశ్న కవ్వించేదిగా వున్నది.

"అన్నీ మీకు చెప్పాలా?" అన్నాడు. అప్పటికే చుట్టూ చూస్తున్నాడతను, ఎవరైనా గమనిస్తున్నారా అని.

"చెప్పాలి. చెప్పి తీరాలి. మీకు ఎందుకింత భయం? నాటోటివాళ్ళతో కాస్సేపు మాట్లాడటమే తప్పయితే, మీరింక లోకంలో జయించే గొప్ప విషయాలేమిటో?" అన్నది రేఖ.

"మా జీవితాల్లో గొప్ప విశేషాలేముంటాయి?" అన్నాడతను మూతి బిగించి.

"మీకు ఎవ్వరూ లేరా? తల్లి, తండ్రి, అన్నా చెల్లి...." అని ఆగి "భార్య?" అన్నది.

అతను ఒకే ఒక క్షణం కళ్ళెత్తి చూసి "ఎవ్వరూ లేరు" అన్నాడు.

"నేను నమ్మను. మన దేశంలో ప్రతి వాళ్ళకీ ఒక కుటుంబం ఉంటుంది. మీ కుటుంబంలోని వారంతా మీ మనస్సు విరిచేసి వుంటారు. అందుకే యిలా వచ్చేశారు. అవునా? బయట ప్రపంచం చూడండి, ఎంత చైతన్యంతో సజీవంగా ముందుకు సాగిపోతోందో! స్వాములారి ఆజ్ఞ లేనిదే ఆకు కూడా కదలనట్లున్న ఈ సమాధిలో మీరు కూచోడం చాలా తప్పని నా అభిప్రాయం. బయటికి వస్తే మీరు సినిమా హీరో అయిపోతారు తెలుసా? అసలెప్పుడయినా అద్దంలో చూచుకొన్నారా?" రేఖ గబగబ అంటోంటే అతని ముఖం ఎర్రబడింది. కంఠం నరాలు బిగిసిపోయినట్టు, నరాలు

దీపావళి శుభాకాంక్షలతో....
మీ
జూలూరి నాగరాజారావు
PHONE: 72333
76545

వివాహాది శుభకార్యములకై విచ్చేయండి

పట్టుచీరలకు పెట్టింది పేరు

జూలూరి వీరేశలింగం
బనారస్ సిల్క్ ప్యాలెస్

జూలూరి మాన్షన్-జనరల్ బజార్
సికింద్రాబాద్, ఆంధ్రప్రదేశ్


కదిలిపోతున్నట్లు. ఎటు చూడాలో తెలియని కళ్ళు భూమి లోకి చూపుల్ని గుచ్చుకున్నట్లు నిలబడి పోయాడతను.

ఆ తరువాత శ్రీరేఖ అతన్ని ఒంటరిగా చూడలేదని చెప్పాలి. దేవాలయాల్లో, పూజల్లో నమ్మకం లేకపోయినా ఆమె సాయంత్రాలు హారతికి వెడుతోనే ఉంది, క్లాసులు లేనప్పుడు. అతని అందమైన ఆకారాన్ని చూస్తోనే ఉంది. అంతలోనే ఆమె జాయినైన డిప్లొమా కోర్సు పూర్తయిపోయింది మరునాటి నుంచి తను ఆ సంస్థకు వెళ్ళే అవకాశం లేదు. అందుకే చిన్న చీటీ మీద తన చిరునామా వ్రాసి అందరూ వెళ్ళిపోయాక దేవాలయంలోనే అతనికి అందించింది. "నేను రేపట్నుంచీ యిక్కడికి రాను. ఎప్పుడేనా చూడాలనిపిస్తే వస్తాను. సరేనా?' అన్నది.

అతను తల వూపాడు.

ం ం ం

"ఏమిటోయి, కనబడ్డమే మానేశావు!" అంటూ విజయ




వచ్చి అమాంతం భుజాలను పట్టి కుదిపేసింది. మెల్లిగా ఆమె చేతులను విడిపించుకుంది రేఖ. "ఏమిటీ, చాలామూడీగా ఉన్నావు?" అన్నది విజయ, రేఖ ముఖంలోకి చూస్తూ.

శ్రీరేఖ బ్యాగు తెరచి ఆమెకి ఒక కవరిచ్చింది. అందులో రెండు పేజీల వుత్తరం. "ప్రియమైన చెల్లీ"! అంటూ ఆరంభించిన ఆ వుత్తరంలో, "ఎవర్నీ నోరారా ప్రేమగా పిలుచుకోని యీ అభాగ్యుడికి యీనాడు, నిన్ను చెల్లీఅని పిలవాలని కోరిక కలిగింది. నన్ను గురించి ఆలోచించి నా కోసం బాధపడుతూ నా బ్రతుకు ఎటు పోవాలో నిర్దేశిస్తూ అధికారంతో మాట్లాడిన నువ్వు నాకు సహోదరివి కాక మరెవరని అనుకోను?" ఇలా సాగిన ఆ ఉత్తరం ఆ బ్రహ్మచారి వ్రాసినదని అర్థమైంది విజయకు. ఉత్తరం మరో సారి తిరగేస్తూ రేఖవంక చూచింది. ఆమె కళ్ళు నీళ్ళతో మెరుస్తున్నాయి. ఉత్తరం అటు పడేసింది విజయ.

"ఏమ్, ఏమిటిది? ఆశించినది ఒకటైతే మరోటి జరిగిందని బాధపడుతున్నావా? ఇంతకీ యీ శుకమహర్షి చిట్టిచెల్లీ అని ఆరంభించాడేమిటి ?" అన్నది స్నేహితురాలి చేతులు పట్టుకొంటూ.

రేఖ యీ మాటలకు షాక్ తిన్నట్టు చూసింది. "విజయా! నేను తపస్సులు భంగంచేసే క్షుద్రమైన అప్సరసని అనుకుంటున్నావా?" అన్నది బాధగా.

"ఛా! అది కాదోయి! నీ కళ్ళల్లో నీళ్ళు చూస్తే ఆశాభంగం వల్లనేమో అనుకున్నాను" అని సర్దబోయింది విజయ.

"నేనెంత తప్పు చేశాను చూశావా? నిర్మలమైన కొలనిలో ఒక రాయి విసిరి, నీళ్లు చెదరి సుడులు తిరుగుతోంటే అదో ఆటనుకున్నాను. కొలనులోని అందమైన చేపల్లాంటి అతని మనోభావాలు చెల్లాచెదరై ప్రాణభీతితో పరుగెడితే, నవ్వుకొన్నాను లోలోపల. నేనెంతటి పాపినో తలచుకొంటే, నాకు అసహ్యం వేస్తోంది. అద్దం లాంటి ఒక మనస్సుమీద మసి పూశాను" తనలో తానుగా, మనస్సు మెలితిరిగే వేదనలోంచి వచ్చిన మాటలు యివి !

"పోనివ్వు రేఖా! 'చాలా పొరబాటయింది బ్రహ్మచారి గారూ, మీ జోలికి రావడం గొప్ప అపచారం'అంటూ ఒక వుత్తరం వ్రాసి పడేయి. లేకపోతే, నీకెల్లాగూ మొహమాటాలు లేవు గనుక, వెళ్ళి యీ మాటలు డైరక్టుగా చెప్పేయి!" అన్నది తేలిగ్గా విజయ.

"అంత తేలిగ్గా తీసుకోలేను విజయా! బంధాలన్నీ తెంచుకొని, దివ్యమైన ఒకబాటలో వెడుతున్న అతణ్ణి వెనక్కి పిలిచి, చిలిపి మాటలాడి, చిక్కుముడి వేసేశాను. ఏకాగ్రత దెబ్బతిని ఎంత కలతల పాలైనాడో! తన్నెత్తి మరో మనిషివంక చూడని నియమంలోంచి, తన నెవరు గమనిస్తున్నారో అని భయపడే ఒక పిరికితనంలోకి లాక్కొచ్చి పడేశాను. దొంగతనంగా నాకీ వుత్తరం వ్రాసి పోస్టులో పడేయడం కోసం ఎట్లా దిగజారవలసి వచ్చిందో విజయా! నా పశ్చాత్తాపం నీకు అర్థం కావడంలేదా? అతనికి ఒక సహోదరి మీద మాత్రం రాగం ఉదయించడం తప్పే కదా జారిన యీ మెట్లన్నీ తిరిగి అతను ఎక్కగలడంటావా?" శ్రీరేఖ మాట్లాడుతూనే, వుత్తరం మడిచి, కవరులో పెట్టి, బ్యాగులో జాగ్రత్త పరిచింది.

విజయ నిట్టూర్చింది. "నేను వెళ్లి స్వయంగా క్షమాపణ చెప్పివస్తానుగానీ, నువ్వింక అవే మనస్సులో పెట్టుకోకు మరి. మర్చిపో!" అన్నది.

పదిరోజుల తర్వాతగానీ విజయ కనిపించలేదు. ఈ పది రోజుల కాలంలో మనస్సులోని తేనె తుట్టె, అర్థంకాని బరువెక్కిపోతోంది రేఖకు. ఎంతటి గాయమూ మానే రోజు వస్తుంది కదా అనుకుంటున్నది.

"రేఖా! నీ కబురు అందించలేక పోయాను." అన్నది దిగులుగా విజయ,

"ఏం ?" నీరసమైన ప్రశ్న.

"అతడు మఠంలోని వేరే శాఖకు క్రిందటి వారమే బదిలీ అయి వెళ్ళిపోయాడు". అని విజయే జవాబు.

వెళ్లిపోయాడా? — అంటే పారిపోయాడా, లేక వెళ్ళగొట్టేశారా? దూరం పంపేశారా? — ఇల్లాంటి ప్రశ్నలు రాళ్ళవర్షంలా తగిలి, శ్రీరేఖ మనస్సులోని తేనెతుట్టె పగిలి, భీభత్సమై కొత్త గాయాలు రేగాయి,